క్లుప్తంగా

మ్యాన్‌హోల్‌పై కుంగిన గ్రిల్



స్కంద్ బిజినెస్ షాపింగ్ మాల్ వద్ద మ్యాన్‌హోల్‌పై కుంగిన గ్రిల్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలోని చాంద్ టాకీసు – స్కంద బిజినెస్ షాపింగ్ మాల్ ఎదురుగా పెద్ద గుంత ఏర్పడింది. మురుగు నీటి కాల్వపై ఏర్పాటు చేసిన గ్రిల్ కుంగిపోవడంతో అడుగు లోతు గుంత కనిపిస్తోంది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు తిరుగుతూ ఉంటారు. నడిరోడ్డుపై గ్రిల్ కుంగిపోవడంతో అటువైపుగా వెళ్లే కొందరు రాళ్లను అడ్డుగా పెట్టారు. ప్రతిరోజూ రద్దీగా ఉండే ఈ రహదారిలో మ్యాన్‌హోల్‌పై కొత్త గ్రిల్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



శాకంబరీ దేవిగా అమ్మవారు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో వెలసిన గంగమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా స్థానిక మీది వేముల బిల్డింగ్‌లలో ఉన్న గంగమ్మ ఆలయం వద్ద పూజారి నాగేశన్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకొని కొబ్బరికాయలు సమర్పించి, ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులకు, ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మొక్కుకున్నారు. అమ్మవారు శాకంబరీ దేవి అంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఉరుకుందకు తరలిన భక్తులు



ఉరుకుందకు బయలుదేరుతున్న భక్తులు

ఓర్వకల్లు: శ్రావణ మాసం సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఉరుకుంద ఈరన్న స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. ముందుగా ఆదివారం స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కషాయ జెండాలను చేపట్టి దేవాలయం నుంచి పదుల సంఖ్యలో ఉరుకుందకు కాలినడకన బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఆషాఢ మాసం చివరి అమావాస్య రోజున స్వాముల వారిని దర్శించుకునేందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 17 సంవత్సరాలు కాలినడకన వెళ్లినట్లు వివరించారు. భక్తులు వెంకటేశ్వర్లు, మహేష్, కార్తీక్, విష్ణువర్ధన్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్

కల్లూరు: అశ్విని ఆస్పత్రి నూతన భవనం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బి.ప్రమీల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో ఉచితంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్, ఆస్తమా, శ్వాస కోశ సంబంధిత రోగాలకు, ఎముకల సాంద్రత, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుస్తీ చిన్నోడికి చేయూత



కుస్తీ క్రీడాకారుడు అభినవ్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న అవోపా నాయకులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న బాలుడు నాగ హితేష్ అభినవ్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు చత్తీస్‌ఘడ్‌కు వెళ్తున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం కర్నూలు నగరంలోని అవోపా కార్యాలయంలో అవోపా కర్నూలు నాయకులు అతని రవాణా ఖర్చుల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించారు. అభినవ్ జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆ సంస్థ అధ్యక్షుడు, డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. కార్యదర్శి జీవీ మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వీవీ నరసింహులు, సభ్యులు కొత్త కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాబును నమ్మితే మోసం గ్యారెంటీ

- కూటమి మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్
- గూడూరులో పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ స్కానర్ లోగోను ఆవిష్కరిస్తున్న సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్: సూపర్‌సిక్స్ పథకాల పేరుతో సీఎం చంద్రబాబు చేసిన మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని.. ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని తెలియజేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గూడూరులో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 అంటూ 143 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. నమ్మిన వారిని మోసం చేయడమే బాబు నైజమన్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేరిస్తే, చంద్రబాబు మాత్రం అందుకు విరుద్ధంగా హామీలన్నింటిని తుంగలో తొక్కి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎవరైనా ప్రశ్నిస్తే కూటమి నాయకులు వారిపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారన్నారు. బాబు ప్రజలకు ఇచ్చిన హామీలను, చేస్తున్న మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ గ్రామానికి వెళ్లి ప్రజలకు వివరించాలని, అందుకు సంబంధించిన క్యూఆర్ కోడ్ స్కాన్ వివరాలను సతీష్ నాయకులకు వివరించారు. కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రామాంజినేయులు, ఆబేలు, కౌన్సిలర్ దస్తగిరి, మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు నరసింహారెడ్డి, కుమార్, యేసేపు, గోపాల్, మహేశ్వరరెడ్డి, విజయుడు, విక్రమ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గంగాధర్, భాస్కర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, సురేష్, నాగరాజు, మాధవస్వామి, రామచంద్రుడు, అంజి, ప్రతాప్, రమేష్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసం చంద్రబాబు నైజం



సీఎం చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

- హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను వంచించిన ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శలు
- 19వ వార్డులో బాబూ ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్ నగర్, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, పార్టీ నాయకులతో కలిసి 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని ఇంటింటికీ తిరుగుతూ.. ఏడాది కాలంలో వివిధ సంక్షేమ పథకాలు అందక ప్రతి కుటుంబం ఎంత మోసపోయిందో వివరించారు. కాలనీలో ఎవరిని పలకరించినా సంక్షేమ పథకాలు అందడం లేదని, ప్రతిదాంట్లో కోతలు పెట్టి పథకాలు కొందరికే ఇస్తున్నారని ప్రజలు నాయకుల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. కాటసాని మాట్లాడుతూ.. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు తెలుసుకున్నారన్నారు. కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలతో స్కాన్ చేయించారు. ఏడాది కాలంలో సంక్షేమ పథకాలు అందకపోవడం వల్ల ఎంత నష్టపోయారో వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగనన్న కులవృత్తులకు, పొదుపు సంఘాల మహిళలకు, వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలు అందించి సంక్షేమ సారథిగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ఉచిత ఇసుక ఎక్కడా అమలు కావడం లేదని, ట్రాక్టర్ ఇసుక కోసం రూ.3500 చెల్లించాల్సి వస్తుందన్నారు.

రోడ్లు అధ్వానం

నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని కాటసాని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో రోడ్లు వేస్తామని చెప్పారని గుర్తు చేశారు. 14 నెలలు అవుతున్నా కాలనీల్లో రోడ్ల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రోడ్డుపై నీళ్లు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను కూటమి నాయకులు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేసేలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు పనులు చేయవద్దని కూటమి నాయకులు అధికారులను ఆదేశిస్తున్నారని విమర్శించారు. బాబు అంటే గుర్తుకొచ్చేవి వెన్నుపోటు, మోసం, అబద్ధాలు అని మేయర్ రామయ్య అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. పలువురు కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో పదవులు పొందిన నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (న్యూటౌన్): నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర చరిత్ర కలిగిన వారికి, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. సత్ప్రవర్తతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

పరిష్కార వేదికకు అధికారులు హాజరుకావాల్సిందే

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

సి.బెళగల్: మండల కేంద్రంలో జరగనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు తప్పక హాజరుకావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు సి.బెళగల్ గ్రామంలో పార్టీ నాయకుడు సీబీ గోవిందరెడ్డి ఇంటి ప్రాంగణంలో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ మోహన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దారంతా గుంతలమయం!





లక్ష్మీపురం బస్టాప్ వద్ద గుంతల్లో నిలిచిన వర్షపు నీరు, లక్ష్మీపురం రోడ్డు దుస్థితి

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధి లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే దారంతా గుంతలమయంగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి హంద్రీ నది బ్రిడ్జి వరకు కంకర తేలి గతుకులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై నిత్యం లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం కర్నూలుకు వెళ్లే వారు ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. 44వ జాతీయ రహదారి బస్టాప్ నుంచి లక్ష్మీపురం గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. బస్టాప్ వద్ద వర్షం వచ్చిన ప్రతిసారి నీరు నిలుస్తోంది. దారంతా గుంతలమయంగా ఉండడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు, లక్ష్మీపురం గ్రామస్తులు కోరుతున్నారు.

గోరుకల్లు చేరుకున్న కృష్ణా జలాలు

పాణ్యం: కృష్ణా జలాలు మండల పరిధిలోని గోరుకల్లు జలాశయానికి చేరాయి. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి నీటిని వదిలారు. ఈ నీరు ఆదివారం తెల్లవారుజామున గోరుకల్లుకు చేరుకున్నట్లు ఇంజినీర్లు తెలిపారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 8 వేల క్యూసెక్కుల నీరు గోరుకల్లులోకి వస్తోందన్నారు. రైతుల కోరిక మేరకు గోరుకల్లులో ఉన్న నీటిని ఎస్సార్బీసీకి విడుదల చేయగా ప్రస్తుతం గోరుకల్లు ఓటీ రెగ్యులేటర్‌ను మూసివేసినట్లు తెలిపారు. పై నుంచి వచ్చే నీటిని బైపాస్ ద్వారా ఎస్సార్బీసీకి పంపుతామన్నారు. ఆదివారం నాటికి గోరుకల్లులో 2.8 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

గూడ్స్ రైలుకు ఎదురెళ్లిన యువకుడు

పాణ్యం: మండల కేంద్రంలోని వొద్దెల వాగుపై ఉన్న రైల్వే బ్రిడ్జిపై ఓ యువకుడు గూడ్స్ రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికులు, రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. బ్రిడ్జి ట్రాక్‌పై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడన్నారు. క్రిష్ణమ్మకోన రైల్వే స్టేషన్ నుంచి పాణ్యం స్టేషన్‌కు వస్తున్న ఓ గూడ్స్ బ్రిడ్జి సమీపంలో నెమ్మదిగా వస్తుండగా రైలు పట్టాలపై యువకుడిని గమనించిన లోకో పైలెట్ హారన్ మోగించాడు. ఆ యువకుడు పక్కకు తప్పుకోకుండా అలాగే ఉండడంతో లోకోపైలెట్ రైలును నిలిపివేశారు. కిందకు దిగి హుటాహుటిన ఈ వ్యక్తి వద్దకు వెళ్లగా అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. కాసేపటి తర్వాత గూడ్స్ రైలు తిరిగి పాణ్యం స్టేషన్‌కు చేరుకుంది. ఆ యువకుడు ఎవరనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు (న్యూటౌన్): టెక్నాలజీ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుందో, సైబర్ నేరాలు అలానే పెరుగుతున్నాయని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు బ్యాంకింగ్ మోసాలు, సోషల్ మీడియా వంచనలు, ఫేక్ లింక్‌లు, యూపీఐ మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. 'మీ భద్రత మీ చేతుల్లోనే ఉందని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దని, అనుమానాస్పద లింక్‌లు ఓపెన్ చేయొద్దన్నారు. అజ్ఞాత వ్యక్తుల మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. మీ ఫోన్‌లో ఫేక్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రమాదకరంగా మారిన ముళ్ల చెట్లు

కర్నూలు (న్యూటౌన్): బుధవారపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ పోల్స్‌కు ప్రధాన తీగలు అమర్చారు. దీని నుంచి ఇతర స్తంభాలకు, గృహాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. ముందే వర్షాకాలం కావడంతో చెట్లకు విద్యుత్ సరఫరా అయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్లచెట్లను తొలగించి, రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని బుధవారపేట కాలనీ ప్రజలు కోరుతున్నారు.

కూలిన ప్రహరీ.. లోపించిన భద్రత



వసతి గృహం వైపు కూలిన ప్రహరీ గోడ

ఓర్వకల్లు: ప్రహరీ కూలడంతో బాలికల వసతి గృహానికి భద్రత లోపించింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదేళ్ల క్రితం ప్రహరీ గోడను నిర్మించారు. కాంట్రాక్టర్ల కక్కుర్తి, అధికారుల ఉదాసీనత కారణంగా ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడంతో పదేళ్లు గాకముందే కూలిపోయింది. గత రెండేళ్ల క్రితం జూన్ మాసంలో కురిసిన భారీ వర్షాలకు ప్రహరీ గోడ కూలి ఎస్సీ బాలికల వసతి గృహం వైపు పడింది. దీంతో పక్కనే ఉన్న బాలికల మరుగు దొడ్లకు అభద్రత వాటిల్లింది. హాస్టల్ విద్యార్థినులు ఉదయం, సాయంత్రం వేళల్లో స్నానాలు చేయాలన్నా, కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా తీవ్ర అసౌకర్యాల నడుమ కాలం వెల్లదీస్తున్నారు. కొందరు ఆకతాయిలు అటుగా వెళ్లి కూలిన గోడపై నుంచి తొంగి చూస్తున్నా దండించే వారు లేక, ఈ విషయాలు ఎవరికీ చెప్పుకోలేక బాలికలు మిన్నకుండి పోతున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని హాస్టల్ విద్యార్థినులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బాలికలకు ఏమైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని? పిల్లల తల్లితండ్రులు వాపోతున్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలికలు ఎదుర్కొంటున్న భద్రతా లోపాలను దృష్టిలో ఉంచుకొని, తక్షణమే ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్యాంకర్ బోల్తా



కర్నూలు(రూరల్): ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని గార్గేయపురం శ్మశాన వాటిక వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఆత్మకూరు నుంచి బళ్లారికి సిమెంట్ మిశ్రమంతో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాలుక అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీధర్ తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన



రక్షణ గోడ దెబ్బతిన్న గార్గేయపురం- కేతవరం మార్గంలోని వంతెన

కర్నూలు (రూరల్): గార్గేయపురం- కేతవరం గ్రామాల మధ్య హంద్రీ–నీవా కాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన పునరుద్ధరణ లేకపోవడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వంతెనపై గార్గేయపురం, కేతవరం గ్రామాలతో పాటు ఓర్వకల్, నంద్యాల, బనగానపల్లె, బేతంచెర్ల, మద్దిలేటి స్వామి తదితర ప్రాంతాలకు రోజూ వాహనదారులు, రైతులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వంతెనకు ఒక వైపు రక్షణ గోడ పూర్తిగా తొలిగిపోయింది. వాహనదారులు కాస్త అదుపు తప్పినా, పంట పొలాలకు వెళ్లే రైతుల ఎద్దులు బెదిరినా ప్రమాదం తప్పదు. ఇక స్కూల్ బస్సులు వెళ్లినపుడల్లా తల్లిదండ్రులు ఆందోళనతో గడపాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో చిమ్మచీకటిలో ప్రయాణం ఇంకా ప్రమాదకరంగా మారుతోంది. వంతెనకు కనీస మరమ్మతులు చేపట్టి, రక్షణ గోడల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కురవని వానలు.. ఎండుతున్న పంటలు



కోడుమూరులో వాడుముఖం పట్టిన పత్తి పంట



ప్యాలకుర్తిలో ఎండిపోతున్న చౌళకాయ పంట

కోడుమూరు రూరల్: ముందస్తుగా కురిసిన వానలకు ఖరీఫ్ కింద కోడుమూరు, గూడూరు మండలాల్లో రైతులు పత్తి, కంది, సజ్జ, జొన్న పంటలతో పాటు, ఇతర పంటలను భారీగా సాగు చేశారు. ముందస్తుగా కురిసిన వానలు తప్ప మళ్లీ పెద్దగా వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అరకొరగా కురుస్తున్న వానలు పంటలకు సరిపోవడం లేదు. ముఖ్యంగా ఎర్రనేలల్లో సాగు చేసిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోగా, నల్లరేగడి నేలల్లో సాగు చేసిన పంటలకు మరో నాలుగైదు రోజుల్లో వానలు కురవకపోతే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయిన రైతులు ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను చూసి తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పాపం.. పసిపిల్లలు!

దయనీయంగా చెంచు కాలనీలోని ఓ కుటుంబ పరిస్థితి

- అనారోగ్యంతో ఇంటి పెద్ద దిక్కు మృతి
- తల్లికి క్షీణించిన ఆరోగ్యం
- ప్రశ్నార్థకంగా నలుగురు పిల్లల భవిష్యత్తు



ఇంటి పెద్ద మేకల నాగశేషులు మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

పాణ్యం: స్థానిక చెంచు కాలనీలో ఓ కుటుంబం పేదరికంలో మగ్గుతూ ఉన్న ఒక్క ఆసరా కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడింది. ఇంటి పెద్ద గత 20 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఆలన పాలన చూసే తల్లి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మరో వ్యక్తి సాయం చేస్తే గానీ నిలబడలేని పరిస్థితి. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. వీరి భవిష్యత్తు ఏంటనే ప్రశ్న అందరినీ కలచివేస్తుంది.

వివరాల్లోకి వెళితే.. పాణ్యం చెంచు కాలనీలో మేకల నాగశేషులు (30) గొర్రెల కాపరిగా పని చేస్తూ, అడవిలో లభించే తేనె తీసుకొచ్చి విక్రయించి భార్య పిల్లలను పోషించుకుంటున్నారు. భార్య కొండమ్మ, వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు సంతానం ఉన్నారు. గత కొన్ని రోజులుగా నాగశేషులుకు ఆరోగ్యం సరిగ్గా లేక ఇంటి వద్దనే ఉంటున్నారు. దగ్గు, కడుపునొప్పి తీవ్రంగా ఉంది. కడుపు ఉబ్బిపోయి తీవ్ర దగ్గు వచ్చేది. ఈ స్థితిలో ఆదివారం తెల్లవారుజామున మేల్కొనలేదు. పిల్లలు నిద్ర లేపేందుకు వెళ్లి చూడగా ఉలుకు పలుకు లేకపోవడంతో చుట్టు పక్కల వారు వచ్చి చూసి ఆయన చనిపోయినట్లు చెప్పారు. భార్య కొండమ్మ భర్త మృతదేహాన్ని చూసేందుకు కూడా ఆరోగ్యం సహకరించలేనంతగా బాలింత జబ్బులతో బాధపడుతోంది. ఇతరులు సహకరిస్తే కానీ నిలబడలేదు. అంతలా ఆరోగ్యం క్షీణించింది. తీవ్ర రక్తహీనత, ఇతర వ్యాధులతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది.

ప్రశ్నార్థకంగా పిల్లల జీవితం

మేకల నాగశేషులు, కొండమ్మ దంపతులకు నాలుగురు సంతానం కాగా పెద్ద కుమార్తె మేకల కొండమ్మ నెరవాడ వద్ద గిరిజన పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కుమారుడు ఈరయ్య (9), చిన్న కుమార్తె మంతనాలమ్మ (5), చిన్న కుమారుడు నాగులేటి (8) నెలల బాలుడు ఉన్నారు. తల్లిదండ్రుల అనారోగ్యం రీత్యా పెద్ద కుమార్తె ఇటీవలే ఇంటికి వచ్చి ఉంటోంది. చుట్టుపక్కల వారు అన్నం పెడితే వారికి తినిపించేది. తల్లికి ఆరోగ్య సమస్యలు ఉండటంతో ఆమెకు పెద్ద కుమార్తె సపర్యలు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం తండ్రి మృతితో ఆ పిల్లలు దిక్కులేని వారయ్యారు. పిల్లల ఆలనపాలన ఎవరు చూడాలి? వారి పోషణ ఎలా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఆ కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న వారంతా 'అయ్యో.. పాపం.. పసిపిల్లలు' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ పిల్లల ఎలా బతుకుతారని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ కుటుంబానికి ఆసరా కల్పించాలని కోరుతున్నారు.